

... మాలతీచందూర్

# విజయ రానన్నది

సాయంత్రం నాలుగింటికి టీ కి నీళ్ళు పడేసి, ప్లగ్ పిన్ను పెడుతూ వుండగా, అనుకోకుండా ప్రత్యక్షమయింది విజయ వీధి గుమ్మం దగ్గిర! ''రా, రా'' అని స్వాగతవచనం చెబుతూ, కెటిల్ లో మరొక గ్లాసుడు నీళ్ళుపోసి, ముందు రూమ్‌లోకి వచ్చి కూచున్నాను.

''ఏమిటీమధ్య దర్శనాలే లేవు'' అన్నాను సంభాషణకి వుపక్రమిస్తూ.

''నువ్వంటావుగాని నువ్వువచ్చావా ఏమిటి మాయింటికి? అంది విజయ,

''సరి—నాతో వంతులు పెట్టుకుంటే అయినట్టే! నాకు రావాలని అనిపించినపుడు వస్తాను. నేను మీయింటికి మూడుసార్లు వచ్చాను గనక నువు కనీసం, రెండుసార్లయినా మాయింటికి రావాలి — అని లెక్కలుగడితే లాభం లేదు,'' అన్నాను కొంచెం నిర్మొగమాటంగా నవ్వుతూ.

విజయకి నా సంగతి తెలుసు గనక ఆ ధోరణి అక్కడితో ఆపి, ''జర్మన్ ఫిలిమ్ ఫెస్టివల్‌కి వెళ్ళారా?'' అని ప్రస్తావన మార్చింది.

ఏదో ఈ ముక్కా ఆ ముక్కా మాట్లాడుతూ వుండగా కెటిల్ సంగీతం పాడటం, నేను లోపలికివెళ్ళి, శ్రేష్టమైన ఇండియా తేయాకు పాట్‌లోవేసి, టీ బోర్డువారు చెప్పిన ప్రకారం, సలసలా కాగే నీరు ఆ టీ లీవ్స్ మీద పోసి అయిదునిముషాలు మూతవేసి వుంచి, అనంతరం టీ చేసుకు తాగడం, సిలోన్ రేడియో తెలుగు రికార్డులు వినడం — యివన్నీ వరసని అయ్యాక యింక వెళ్తానని విజయ లేస్తూ వుండగా అడిగాను. ''రాఘవమ్మ గారింటికి రేపు సాయంత్రం వస్తున్నావా? మనమరాలి పుట్టిన రోజు పండగకి హాజరు వేయించుకోకపోతే వూరుకోదు ఆవిడ'' అన్నాను. రాఘవమ్మ గారింటికి వస్తావా అని విజయని నేను అడగటంలో నా స్వార్థం కొంత లేకపోలేదు. పెళ్ళిళ్ళమాట ఎటువున్నా, నాకు చిన్నప్పట్నుంచీ పేరంటాలకి వెళ్ళడం చాలా సరదా. ఎందుకని అడక్కండి —అది చెప్పాలంటే మరొక గ్రంథమవుతుంది. నేనొక్కతెనీ వెళ్ళలేను—భయమని కాదు, ఏదో బిడియమేస్తుంది. మరొకరు తోడు వుంటే పిచ్చాపాటీ చెప్పుకుంటూ నవ్వుకుంటూ కాలక్షేపం చేసిరావచ్చు. సినిమాకి తోడులేనిదే వెళ్ళడానికి ఎలా యిష్టపడనో, పేరంటాల విషయంలో అలాంటిదే నాపద్ధతీను! మా అక్కని తోడురమ్మని అడిగితే, నీ పేరంటాలకి నేనెక్కడ చావను? అంతగా కావలిస్తే పనిమనిషిని వెంట తీసుకెళ్ళు—అంటుంది. ఇంత తతంగం వెనక వుండడంచేత, విజయ వస్తుందేమోనని అడిగి చూశాను. రాఘవమ్మగారు నాకెంత పరిచయమో, విజయకీ అంతే పరిచయం. నాకు పంపినట్టే విజయకీ ఇన్విటేషన్ పంపే వుంటారు.

''రాఘవమ్మ గారింటికా, నేనా ...... వాళ్ళ యింటి చాయలకి రాను. కంఠంలో ఊపిరి వుండగా వాళ్ళ గుమ్మం తొక్కుతానా యిక?'' అంది మొహం కందగడ్డలా చేసుకుంటూ.

నేను ఆశ్చర్యపోయాను. ''ఏమొచ్చింది? ఇన్విటేషన్ నీకు అందలేదా?'' అని అడిగాను.

''పిలుపుకేం భాగ్యం ఈరోజులలో! మూడు నయాపైసలు అతికించి కార్డు పోస్టులోపడేస్తే బొట్టుపెట్టి పిలిచినట్టే భావించుకోవాలి. నువ్వు వెళ్ళు — నేను మట్టుకు రాను. వాళ్ళ పెద్దబ్బాయి అమెరికాలో వుంటే ఎవరికిగొప్ప?'' అంటూ రాఘవమ్మ గారి మీద దండకం మొదలుపెట్టింది.

విజయని కూచోబెట్టి, శాంతపరిచి, అనునయ వాక్యాలతో మాట్లాడిన మీదట తేలిన సారాంశం ఏమిటంటే, తనకూతురు పుట్టిన పండగకి విజయ స్వయంగా వెళ్ళి పిలిస్తే, రాఘవమ్మగారు తప్పకుండా వస్తానమ్మా అని తేనె పలుకులు చెప్పి, చివరికి రాలేదట. అదీ కోపం! రాఘవమ్మగారు మాకంటె వయసులో, అంతస్థులో పెద్దదనీ, ఏదైనా ఆఖరు క్షణాన అనుకోని పని తగిలి రాలేకపోయిందేమోననీ, వద్దామనుకుంటూ వుండగా హఠాత్తుగా ఎవరైనా

బంధువులు వచ్చివుండవచ్చనీ, పెద్దకోడలు పురిటికెళ్లి యింటికంతా తనే ఆడదిక్కు అవడంవల్ల పని తెములుచ్చుకోలేకపోయిందేమో ననీ, స్వభావరీత్యా ఆమె నిష్కపటి గనక బెనిఫిట్ ఆఫ్ డవుట్' ఆమెకివ్వడం సమంజసమనీ ఏమిటేమిటో ఆమె తరపు వకాల్తా పుచ్చుకున్నట్టు చెప్పి చూశాను. కాని, మా విజయ వింటుందా? తన గోలే తనది!

"నువ్వు వెళ్లవోయ్ — నాకెందుకు చెబుతావు ఆమె గుణగణాలు," అంటూ మొహం చిట్లించుకుంది. 'ఇక చాలు' అని నేను అప్రసక్తి అక్కడితో ఆపేశాను. మర్నాడు మా అక్క మంచి మూడ్‌లో వుండి, నాకు సాయం వస్తానంది. మేమిద్దరం రాఘవమ్మగారింటికి పేరంటానికి వెళ్లామనుకోండి.

• • •

చెప్పొచ్చేదేమిటంటే, మా విజయలా అనవసరమైన పట్టుదలలకి,అపోహలకి పోయి ఉన్న కొద్దిపాటి స్నేహాలని చెడగొట్టుకునేవారు చాలా మంది కనిపిస్తున్నారు ఈరోజులలో. అవతలవారు మనపిలుపు పట్ల లక్ష్యంలేక రాలేదా, లేక వద్దామనుకున్నా తీరక రాలేకపోయారా అన్న విషయం పైకి ఒప్పుకోకపోయినా అంతర్యంలో తెలుస్తుంది కొంతవరకూ! మనందరం మన 'మనసు' అనే గీటురాయితో, చుట్టూ గల వారిందరికీ, అలాకాదంటే కనీసం మన పరిచయ వృత్తంలోకి వచ్చేవారందరికీ విలువ, వన్నెకడతాం. వన్నెనిబట్టి దాని విలువ మన మనసులో ఉంటుంది. అనుక్షణం అది నకిలీ సరుకేమో అని సంశయిస్తూవుంటే, ఒక్కఅడుగుముందుకి పడదు. జీవితమంతా వల్లగావూ, చుట్టూ వున్నవాళ్లు కుత్సితులుగానూ కనిపిస్తారు. ఆ చిత్రణ వాస్తవమంటారా? జీవితంలో ఎన్ని వెలుగురేఖలు లేవు, ఎందరు పఙ్నవ బాంధవులు లేరు?

మనకి సర్వసాధారణంగా మూడు రకాల మనుషులు కనిపిస్తారు. మనతో సమానస్థులు, మనకంటె ఉన్నతులు, మనకంటె తక్కువ వారు. మళ్లీ ఈసమానత, ఉన్నతి, తక్కువతనం —అనే ఈ మూడూ డబ్బు, అందం, చదువు, సాంఘిక ప్రతిపత్తి, అధికారం వీటిని ఆశ్రయించుకు అదే పనిగా ఉయ్యాలలూగుతూ వుంటాయి. సాంఘిక ప్రతిపత్తికీ, అధికారానికీ మధ్యగలవార స్వల్పం. ఈరెండూ ఒకదానితో ఒకటి కలిసిపోతూ వుంటాయి. కాని డబ్బూ, అందం, చదువు — ఈమూడూ వేటికవి వేరుగా నిలబడుతూ వ్యక్తి జీవితాన్ని తమ యిష్టం వచ్చినరీతిగా పంకర్లు తిప్పుతాయి.

స్త్రీల విషయంలో నైతేనేమి, పురుషుల విషయంలో నైతేనేమి ఈడబ్బు, అందం, చదువు — అనునవి మూడు ప్రధానశక్తులు. నాలుగోది అయిన 'అధికారం' ఈమూడింటి సమ్మేళనతోనూ, వ్యక్తిగత ప్రతిభతోనూ సమకూరుతుంది. 'అధికారం' విషయం అట్లా అట్టేపెట్టి మొదటి మూడూ మన జీవిత పథాలని ఎలా పరిదిద్దుతున్నదీ రూపొందిస్తున్నదీ పరిశీలిద్దాం.

• • •

డబ్బూ, అందం, చదువు — ఈ వ ర స క్రమాన్ని మనం మన స్త్రీలవిషయంలో అందం, చదువు, డబ్బు అని చెప్పుకోవలసి వుంటుంది. అందం అనగా మనకి పుట్టుకతో వచ్చిన కనుముక్కుతీరూ, వరప్రసాదితమైన రూపురేఖలూ ఆపైన కొంతదాకా ఆత్మసౌందర్యం. ఈఆత్మసౌందర్యం బాహ్యప్రకృతికిగాక అంతరంగానికి సంబంధించినది. పువ్వు వికసించి, దాని స్వభావజనితమగు పరిమళమిచ్చినట్టుగా, అంతరంగంకూడా ఆయావ్యక్తుల సంస్కారాన్నిబట్టి పరిసర ప్రభావాన్ని బట్టి కుసుమించి సౌరభం వెదజల్లవచ్చు, లేదా నిర్గంధ పుష్పం కావచ్చు. ఇకపోతే సర్వసామాన్యమగు అర్థంలో మనం వాడే అందం. అందమైన మనుషులు తాము పక్కవారికంటె ఒకమెట్టు పైన వున్నామనుకుంటారు. మొదట్లో వారికి తమ అందం గురించిన ఆధిక్యత తెలియకపోవచ్చు. కాని పోను పోను యింట్లోవాళ్లూ, బయటవాళ్లూ "అందరికంటె నీకు ఒక పదిమార్కులు ఎక్కువ సుమా — నువ్వు అందమైనదానివి గనక!" అని గుర్తుచేస్తూ వుంటారు. వరప్రసాదితమైన ముఖవర్చస్సులోనూ దేహాకృతిలోనూగల సహజ ఆధిక్యతని ఆమె కొన్నాళ్లకి తప్పకతెలుసుకుంటుంది. ఆ తెలుసుకోవడమేమిటి, అతిశయ బీజం లోన మొలకెత్తడమేమిటి—రెండూ ఒకేసారి! వివేకవంతురాలైన స్త్రీ ఆ అతిశయాన్ని పైకి కనబడనీయక పోవచ్చు. అది వేరే విషయం. అకనబడనీయక పోవటం నేర్పూ శిక్షణ అవుతుంది. అంతే తప్ప ఆమె తన ప్రత్యేకతకి అంధురాలు మట్టుకు కాదు.

అందం తర్వాత ఏమనుకున్నాం—చదువు. కాలేజీల సంఖ్య పెరగడంవల్లనయితేనేమి, స్త్రీ విద్యాసౌకర్యాలవల్ల నయితేనేమి, ఈరోజుల్లో చాలామంది అమ్మాయిలు ఉన్నత విద్య నేర్చుకుంటున్నారు. డిగ్రీలు, పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులు అవసరమా, అనవసరమా అనే విషయం అటువుంచండి. పెళ్లయి కాపరానికి వెళ్లేదాకా, చదువు అందుబాటులోవున్న ప్రతి ఆడపిల్లా చదువుకుంటోంది. అది ఎంతవరకూ ఉపయోగబడుతోందా అన్నది కాదు మనకి కావాల్సింది. వ్యక్తి పరిపూర్ణతకీ, జీవన సమస్యలు అర్థంచేసుకునేందుకూ తప్పక ఉపకరిస్తోంది కొంతవరకూ! బి.ఎస్‌సి. పాసైన అమ్మాయి ఆఫీసువేళకి కూరా అన్నం వండిపెట్టగలదా అనుమానంశయం చాలా 'స్టేల్ జోక్'. కాలేజీ చదువు అయాక పెళ్లిచేసుకు గృహకృత్యబాధ్యతలు నిర్వహిస్తున్న అమ్మాయిలు, సంఘ పరిస్థితులని అర్థం చేసుకోవడంలోనూ, నలుగురితో మసలడంలోనూ మిగతా సామాన్య గృహిణులకంటె ఒకమెట్టు పైన ఉంటున్నారు. భార్యగా పిల్లల తల్లిగా, సంఘ జీవిగా—ఏ బాధ్యతలని వేటికవి వేరువేరుగా కేటాయిస్తూ, జీవనం సాగించగలుగుతున్నారు. ఎమ్. ఏ. పాసైన అమ్మాయి పైకి ఎంత నమ్రతగా కనిపించినా, ఆ డిగ్రీ వున్నదనే అతిశయం ఆమెకి లోపల యెక్కడో దాగివుండక మానదు. అది ఆమె పొరపాటు ఎంత మాత్రం కాదు—మానవ నైజం.

ఇక డబ్బుగలవాళ్ల 'అతిశయం' గురించి నేను చెప్పవలసినదేమీ లేదు—అందరికీ తెలిసినదే అది. కాలం ఎలా గడపటమో తెలియక ధనికులు పడే తిప్పలూ, తాపత్రయం చూస్తే, "మీరు కలలోకూడా భాగ్యవంతులవాలని కోరుకోరు," అంటాడు బెర్నార్డ్‌షా. ఏడెనిమిదేళ్ల క్రితం ఆ వాక్యాలు చదివినప్పుడు నాకేమిటో తమాషాగా అనిపించాయే తప్ప నమ్మకం కుదరలేదు. భాగ్యవంతులని దగ్గిరనుంచి చూసిన మీదట ఆ నిజం అనుభవమయింది. ఈలోకంలో అతిదీనులు అనగా మిజరబుల్ పీపుల్ డబ్బులేనివారు కాదు — చేతినిండా పనిలేనివారు. డబ్బుగల వారమ్మాయి యెప్పుడూ తన స్నేహితురాలు స్టాండర్డ్‌లోవస్తే, తను యింబాసిడర్‌లో వెళ్లాలనుకుంటోంది. ఆమె యింబాసిడర్‌లో వస్తే, యింపోర్టు లేకపోయినా—ప్లిమత్ కావాలనుకుంటుంది. ఈధనికులంతంతు ఎలా ఉంటుందంటే వీళ్లు తమ కింద వాళ్లని మొట్టుతూవుంటే, పైవాళ్లు వీళ్లని మొట్టుతూ వుంటారు. అది ఒక చెయిన్ రియాక్షన్. "నాన్నా నన్నెందుకు కొడతావు?" అని కొడుకు అడిగితే, "మానాన్న నన్నుకొట్టాడు గనక" అని చెప్పే సమాధానం లాంటిదే యిదీను. ఈమూడు ప్రధానశక్తులూ త్రివిధస్థాయీ భేదంతో పనిచేస్తాయి, మనకంటె డబ్బులోగాని, విద్యలోగాని, అందంలోగాని ఎక్కువవారు, మనతో సమానస్థులు, మనకంటె తక్కువవారు.

అదృష్టవశాత్తూ ఇది ప్రజాస్వామ్యయుగమవడంచేత, ఈధనగర్వం, విద్యాగర్వం, సౌందర్యగర్వం కట్టడులు తెంచుకు వీరవిహారం చేయడానికి వీలుగాని ఒక నిర్ణీత పరిధిలో ఉన్నాయి. అతిశయమనండి, గర్వమనండి — ఈమూడూ శక్తులూ నిరంతరం వాటిపని అవి చేస్తూంటాయి. "జానకి భర్తకి రెండువందలయాభై జీతం. మా ఆయనకి మూడువందల మువ్వయి, అంచేత నేను గొప్పదాన్ని," అనుకుంటుంది ఒక యిల్లాలు. అంతేకాదు, జానకి ముందు తన ఆధిక్యత కనబరచబోతుంది. అక్కడితో ప్రారంభమవుతాయి దెప్పుకోవడాలూ, చులకనగా మాట్లాడటం, మనస్పర్థలూ వగైరా. తనకి

ముగ్గురు పిల్లలనీ, ఈమూడు వందల రూపాయి తనకి సరిపడటంలేదనీ, జానకి తనకంటె అయిదారేళ్ళ చిన్నదనీ, వాళ్ళకింకా పిల్లలు కలుగలేదనీ, ఈరెండువందల యాభైలో అరవై డెబ్బయి వాళ్ళు వెనకేస కోగలుగుతున్నారనీ ఈయిల్లాలికి తట్టదు. ఒకవేళ తట్టినా ఆనిజం చూడలేక కళ్ళు రెండూ గట్టిగా మూసుకుంటుంది.


అందం, చదువు, డబ్బు — ఈమూడూ సమపాళంలో ఉండి, పరిస్థితులు అనుకూలించిన మీదట, అధికారపు వేట ప్రారంభమవుతుంది. ఈఅధికారపు దేవుళ్ళాట ఎంతకీ పురుషులది కనక మనకది అనవసరం. ఇకపోతే విద్య విషయంలోకూడా స్త్రీలు అంతగా పట్టించుకోరు. ''ఈరోజుల్లో బి.ఎ. పాస్కాని అమ్మాయెవరు?'' అని ఒక్కముక్కతో ధైర్యం చెప్పుకు, సరిపెట్టుకుంటారు. డబ్బు, అందం— ఈరెండిటి విషయంలో మాత్రం చదరంగం ఎత్తులు అలాపడుతూనే ఉంటాయి—మనకంటె ఎక్కువా, మనతో సమానమా, మనకంటె తక్కువా అని!

ఈ అందం, చదువు, డబ్బు యివన్నీ అవతల మనిషి మనసు తెలుసుకునేందుకు సాధనాలు మాత్రమే అను యింగితం వున్నవాడు, మనలో గల అతిశయభారం సూర్యరశ్మిలోని మంచువలె కరిగిపోతుంది. ఏనుగు గుడ్డివాళ్ళ కథకి మల్లే ఒక్క అందం చూసో, ఒక్క చదువు చూసో అవతలవాళ్ళని ఎంచడం తీసెయ్యడంతో ఈగొడవలు వస్తున్నాయి. ఎదుటవాళ్ళని తేలికగా మాట్లాడే ముందు, విమర్శించే ముందు మనలోగల లోపాల వైపు ఒక్కసారి చూసుకుంటే, అనదలుచుకున్నమాట కంఠం దగ్గిర ఆగిపోతుంది. తొందరబడి మాట అనేసి, తమ మాటని ఏదో విధంగా సమర్థించబోతారు చాలామంది. మా విజయ సంగతే తీసుకోండి. కంఠంలో వూపిరివుండగా రాఘవమ్మగారి గడప దొక్కనంతటి విరోధమేమొచ్చింది? తనకూతురు పుట్టిన పండగ పేరంటానికి రానంత మాత్రాన ఆమె దుర్మార్గురాలి కిందనే జమా? అటువంటి క్రోధాగ్నిలోన ప్రజ్వలింపజేయడం తనకేహాని!

నన్నూ అక్కనీ రిసీవ్ చేసుకుంటూ· ''ఏమండీ. మీతో విజయ వస్తుందనుకున్నాను, రాలేదేం?'' అని అడిగింది రాఘవమ్మగారు.

''ఏమోనండీ,'' అన్నాను.

''వాళ్ళింట్లో ఫంక్షన్‌కి రాలేదనేమో! అంతే అయివుంటుందిలెండి. ఆవేళ సాయంత్రం మూడుగంటలకి మెట్లమీద నుంచి స్లిప్ అయి పదిహేనురోజులు మంచంమీద ఉన్నాను. ఇవాళ వస్తుందేమో, చెబుదామనుకున్నాను. కోపం వచ్చివుంటుంది. నేను ఆరోజు వచ్చానుగావని! ఒట్టి భోళాభోళీ మనిషి—యింకా కష్ట సుఖాలు తెలీవు,.'' అన్నది రాఘవమ్మగారు. నేనేం మాట్లాడను—ఆమె చెప్పేది ఆలకించడం తప్ప!


కుతుబ్ మినార్